


మళ్లీ తెరపైకి

పైపుల కుంభకోణం..!



తుంగభద్ర పుష్కరాల్లో రూ.కోట్ల విలువైన పైపులు కొనుగోలు చేశారు. ఆ పైపులు మాయమయ్యాయి. దీనిపై విచారణ వేశామని అప్పుడెప్పుడో చెప్పారు. విచారణ ఏమైంది..? ఆ పైపులు ఎక్కడికెళ్లాయి..? సమగ్ర నివేదిక నాకు కావాలి..?

– శనివారం నగర పాలక సంస్థ సమీక్ష సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

- సమీక్ష సమావేశంలో ప్రస్తావించిన మంత్రి టీజీ భరత్
- విచారణ నివేదిక కావాలని ఆదేశం

కర్నూలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):

ఎప్పుడో మరిచిపోయారనుకున్న తుంగభద్ర పుష్కరాల పైపుల మాయం కుంభకోణాన్ని మంత్రి టీజీ భరత్ మళ్లీ తెరపైకి తీసుకు రావడంతో కమిషనర్ భార్గవ్‌తేజ ఒక్కసారిగా తెల్లమొహం వేశారు. ఏం జరుగుతుందోనన్న కలవరం ఇంజనీర్లలో మొదలైంది. ఏడాదిన్నర క్రితం కౌన్సిల్ సమావేశంలో పైపుల మాయం కుంభకోణంపై విజిలెన్స్ ఎండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేయించాలని వైసీపీ కౌన్సిలరే డిమాండ్ చేశారు. మేయర్ బీవై రామయ్య, అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు కార్పొరేషన్ స్థాయి అధికారుల విచారణ చాలని మాయ చేశారు. విచారణ జరగకుండా తొక్కిపెట్టారు. ఈ కుంభకోణంపై ఆంధ్రజ్యోతి పలు కథనాల రూపంలో వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. తెరమరుగైందని అందరూ భావించారు. మంత్రి టీజీ భరత్ మళ్లీ తెరపైకి తీసుకురావడంతో అధికారుల్లో ఊపిరాడని పరిస్థితి ఏర్పడింది. రూ.6 కోట్ల పైపుల కుంభకోణం విచారణ నివేదికను మంత్రి టీజీ భరత్‌కు ఇస్తారా? లేదా? చూడాలి.

విచారణ పేరుతో తొక్కి పెట్టారు!

తుంగభద్ర పుష్కరాల్లో కొనుగోలు చేసిన రూ.4.50 కోట్ల విలువైన హెచ్‌డీ పైపులు మాయం చేసి ప్రజా ధనం స్వాహా చేశారు. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమగ్ర విచారణ చేయిస్తే భారీ కుంభకోణం వెలుగులోకి వస్తుందని ఆరోపిస్తూ 2022 జూన్ 16న జరిగిన నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో 12వ వార్డు వైసీపీ కార్పొరేటర్ కాంత్రికుమార్ నిలదీశారు. విచారణ చేసి బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ భాగోతాన్ని ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. విజిలెన్స్ వద్దు.. కార్పొరేషన్ అధికారుల విచారణ చాలంటూ ఆ రోజు సమావేశంలో ఉన్న వైసీపీ మేయర్ బీవై రామయ్య, ఆ పార్టీ ఎమ్మెల్యేలు అనడంతో కార్పొరేటర్లు ఓకే చెప్పారు. నెలలు గడిచినా విచారణ కమిటీ వేయలేదు. దీనిపై ఆంధ్రజ్యోతి పలు కథనాల ద్వారా వాస్తవాలు వెలుగులోకి తెచ్చింది. ఎట్టకేలకు అదే ఏడాది ఆగస్టు 30న కమిషనర్ ఎ. భార్గవ్‌తేజ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ కన్వీనర్‌గా ఏడుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని నియమించారు. నెలలు, ఏళ్లు గడిచిపోతున్నా ఈ కమిటీ విచారణ చేపట్టలేదు. విచారణ పేరిట మేయర్ బీవై రామయ్య, వైసీపీ ఎమ్మెల్యేలు తొక్కి పెట్టారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కార్పొరేషన్ అధికారులు కాకుండా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమగ్ర విచారణ చేయిస్తే భారీ కుంభకోణం వెలుగులోకి వస్తుందని పలువురు కార్పొరేటర్లు అంటున్నారు.

ఇది పైపుల కథ

మూడున్నరేళ్ల క్రితం అంటే.. 2020 నవంబరు 20న తుంగభద్రకు పుష్కరాలు వచ్చాయి. డిసెంబరు 7 వరకు జరిగాయి. తుంగభద్ర నదిలో పుష్కర పుణ్య స్నానాల కోసం వచ్చే భక్తుల కోసం నగర శివారున నదీ తీరంలో మునగలపాడు, మసామసీద్ సమీపంలోని పంప్‌హౌస్, సంకల్‌భాగ్, నాగసాయిబాబా టెంపుల్, దక్షిణ షిరిడి సాయిబాబా టెంపుల్, నగరేశ్వరస్వామి దేవాలయం, రాఘవేంద్రస్వామి మఠం, రాంబొట్ల దేవాలయం సమీపంలో పుష్కర ఘాట్లు ఏర్పాట్లు చేశారు. ఘాట్ల దగ్గర భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు, మురుగునీటి పైపులు, మౌలిక వసతులు సహా నగరంలో సుందరీకరణ, రోడ్లు వంటి పనులకు ప్రభుత్వం కార్పొరేషన్‌కు రూ.30 కోట్లు మంజూరు చేసింది. పుష్కర ఘాట్ల వద్ద తాత్కాలిక మురుగు నీరు మళ్లింపు కోసం హెచ్‌డీ పైపులు కొనుగోలుకు సుమారుగా రూ.6 కోట్ల కేటాయిస్తే.. అందులో రూ.4.20 - 4.50 కోట్ల విలువైన హెచ్‌డీ పైపులు కొనుగోలు చేసినట్లు ఇంజనీర్లు చెబుతున్నారు. పుష్కరాలు ముగిసిన తరువాత ఆ పైపులను వీకర్స్ సెక్షన్ కాలనీ పార్కులో భద్రపరిస్తే.. అగ్ని ప్రమాదంలో కాలిపోయాని ఇంజనీర్లు చెబుతున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. రూ.28 లక్షల విలువైన పైపులే కాలిపోయాని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మిగిలిన రూ.4 కోట్ల విలువైన పైపులు ఏమైయ్యాయి..? కార్పొరేషన్ ఇంజనీర్ల నుంచి సమాధానం లేని ప్రశ్న ఇది.



మంత్రి టీజీ ఆదేశంతో అధికారులు విచారణ చేస్తారా..?:

తెరమరుగైందని భావించిన తుంగభద్ర పుష్కరాల పైపుల కొనుగోలు, మాయం వ్యవహారాన్ని సమీక్ష సమావేశంలో మంత్రి టీజీ భరత్ తెరపైకి తీసుకురావడంతో కమిషన్ భార్గవ్‌తేజ, ఇంజనీర్లు, ఇతర అధికారుల్లో కలవరం మొదలైంది. దీనిపై సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని టీజీ ఆదేశించారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు దీనిపై నిజాయితీగా విచారణ చేస్తారా..? గతంలో మాదిరిగానే తొక్కిపెట్టి మాయ చేస్తారా..? అని పలువురు చర్చించుకోవడం కొసమెరుపు.



వీకర్స్ సెక్షన్ కాలనీ పార్కులో ఉంచిన పైపులు (ఫైల్)



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పైపులు (ఫైల్)

ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి

- నగరాన్ని స్మార్ట్ సిటీగా మారుద్దాం
- ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిపాలన
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్
- నగర పాలక సంస్థ అధికారులతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 15: రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నూతన కౌన్సిల్ హాలులో కమిషనర్ ఎ. భార్గవతేజ అధ్యక్షతన నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖల తీరును, నగరంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, శానిటేషన్, రెవెన్యూ, ఇంజనీరింగ్, మెప్మా, టిడ్కో తదితర అంశాలను కమిషనర్ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఉద్యోగుల సహకారంతోనే కూటమి అఖండ విజయం సాధించిందన్నారు. నగరంలో తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు. నగరంలో స్వచ్ఛమైన నీటిని ఎందుకు అందించలేకపోతున్నామని అధికారులను ప్రశ్నించారు. స్వచ్ఛమైన నీటిని అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. కల్లూరు ప్రాంతంలో తాగునీటి సమస్య ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆనంద్ థియేటర్ ఎదురుగా ఉన్న కేఈ మాదన్న నగర్‌లో 10 నుంచి 15 రోజుల వరకు నీరు రావడం లేదని తనకు ఫిర్యాదు చేశారని ఆయన గుర్తు చేశారు. కొన్ని చోట్ల రోజు విడిచి రోజు నీరు వస్తోందని, మరి కొన్ని చోట్ల నీటిని వృథాగా వదిలేస్తున్నారని అన్నారు. ప్రధానంగా పాతబస్తీ ప్రాంతంలో నీటి వృథా ఎక్కువగా జరుగుతోందని, దానిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పాత ప్రభుత్వం దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని..ప్రస్తుతం తమ ఫ్యాక్టరీ నుంచి ఉచితంగా హైపో ద్రావణాన్ని పంపిణీ చేస్తానని మంత్రి తెలిపారు. హంద్రీకి వరదలు వచ్చినప్పుడు పాతబస్తీ, బుధవారపేట వాసులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రత్యామ్నాయ చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. తుంగభద్ర పుష్కరాల సమయంలో ఉపయోగించిన పైపులు ఎక్కడికి వెళ్లాయని కమిషనర్‌ను మంత్రి అడిగారు. పార్కులు, ప్రభుత్వ స్థలాలు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని నిర్మించుకున్న ఇళ్లు, గుడిసెలు, గుడారాలను గుర్తించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. రోడ్ల విస్తరణలో భాగంగా బాధితులతో చర్చించి వారికి ప్రత్యామ్నాయం చూపించాకే తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సుంకేసుల రోడ్డు సెయింట్ జోసఫ్ కళాశాల నుంచి తుంగభద్ర తీరం వెంట జమ్మి చెట్టు వరకు నిర్మించాల్సిన రింగు రోడ్డు పనులు ఎందుకు ఆగిపోయాయని కమిషనర్‌ను ప్రశ్నించారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. పబ్లిక్ టాయిలెట్లపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. వర్షాకాలంలో చెట్లను పెంచుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని హార్టికల్చర్ ఏడీకి సూచించారు. సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మెడికల్ హెల్త్ ఆఫీసర్‌కు సూచించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఎస్ఈ డి.వేణుగోపాల్, ఈఈలు శేషసాయి, షాకీర్ హుస్సేన్, అకౌంట్స్ ఆఫీసర్ చండీప్రసాద్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే విశ్వేశ్వరరెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య, మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఆఫీసర్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన మున్సిపల్ ఉద్యోగులు

వైభవంగా వాదీంద్రతీర్థుల ఆరాధన మహోత్సవాలు



బంగారు రథానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జూన్ 15: వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి ముని మనమడైన వాదీంద్రతీర్థులను బంగారు రథంపై ఊరేగించారు. శనివారం వాదీంద్రతీర్థుల ఆరాధన మహోత్సవాలు నిర్వహించారు. భజన మండళ్లు, కోలాట నృత్యాలు, భక్తుల హర్షధ్వానాల మధ్య రథం ముందుకు సాగుతుండగా.. వేలాదిగా తరలివచ్చిన భక్తులు రథోత్సవాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. అంతకుముందు వాదీంద్రతీర్థుల బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించి బంగారు, వెండి ఆభరణాలతోపాటు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. పీఠాధిపతులు మహామంగళహారతులు ఇచ్చారు. ఊంజల మండపంలో మఠం పండితులు వాదీంద్రతీర్థులపై ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత పండిత కేసరి విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, విజయేంద్రాచార్, ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహస్వామి, సూపరింటెండెంట్లు విజేంద్రాచార్, అనంతపురాణిక్, జేపీ స్వామి, వ్యాసరాజాచార్, జయతీర్థాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్, వాదిరాజాచార్, బిందు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోనే ఉంటాం

- జిల్లాలో సాగు, తాగు నీటి సమస్య లేకుండా చూస్తాం
- ప్రజలు ఇచ్చిన గెలుపును టీడీపీ గుర్తుంచుకుంటుంది
- జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), జూన్ 15: ప్రజల్లోనే ఉంటామని, ఈ మేరకు చంద్రబాబు మార్గదర్శకత్వం ఇచ్చారని జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ బీటి నాయుడు, మాజీ ఎంపీ సంజీవకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లా చరిత్రలో నిలిచిపోయే విధంగా ప్రజలు అభ్యర్థులను గెలిపించారని, ప్రజా సేవను విస్మరించరాదని అన్నారు. ఇప్పటికే సాగు, తాగు నీటి సమస్యను పరిష్కరించే పనిలో ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నారని తెలిపారు. మంత్రి టీజీ భరత్ పరిశ్రమలు తెచ్చేందుకు ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాకు మూడు మంత్రి పదవులు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా బాధ్యతలు తీసుకున్న వెంటనే పెట్టుబడుల వరద మొదలైంద అన్నారు. ఈ క్రమంలోనే విజయవాడతోపాటు పలు నగరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉపందుకుందన్నారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి జర్నలిస్టుల అణచివేత, అక్రమ కేసుల కోసం తెచ్చిన జీవోను రద్దు చేస్తామని అన్నారు. ఈనెల 19 జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చీకటి జీవోను రద్దు చేసి జర్నలిస్టులకు స్వేచ్ఛ కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీ సంజీవ్‌కుమార్, మహిళా జిల్లా ధ్యక్షురాలు ముంతాజ్, రాష్ట్ర కార్యదర్శులు ఆకెపోగు ప్రభాకర్, నంద్యాల నాగేంద్ర, సత్రం రామకృష్ణుడు, ఎల్లప్ప, జేమ్స్, కేవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

మన సత్తా చూపిద్దాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



కర్నూలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి)

ఐటీ, పరిశ్రమల స్థాపనలో ఆంధ్రప్రదేశ్ సత్తా ప్రపంచ దేశాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఏనాడో చాటిచెప్పారు. ఆయన మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్‌లో ఐదేళ్లలో 20 లక్షల ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చాం. ఇవి సాకారం కావాలంటే పెట్టుబడులు, కొత్త పరిశ్రమలు రావాలి. ఉన్నవి విస్తరించాలి. ఉద్యోగాలు, ఉపాధి కల్పన దిశగా పారిశ్రామిక ప్రగతి సాధించే కీలక పరిశ్రమల శాఖను నాకు అప్పగించడం గొప్ప సంతృప్తినిచ్చింది. గత టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో, రాయలసీమలో పారిశ్రామిక ప్రగతికి చంద్రబాబు పెద్దపీట వేశారు. సోలార్ పవర్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. కియోలాంటి ఎన్నో పరిశ్రమ తీసుకొచ్చారు. జగన్ వచ్చాక పీపీఏలు రద్దు చేసి పారిశ్రామికవేత్తల్లో భయాందోళన కలిగించారు. గుజరాత్ తరహా పారిశ్రామిక ప్రగతి, సింగిల్ విండో విధానం కోసం కృషి చేస్తాను. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను అభివృద్ధి చేస్తాను. జిల్లాలో ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకొని నియోజకవర్గాల్లో సమస్యలు పరిష్కరిస్తాను.. అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ వివరాల్లోకి వెళితే..

- పారిశ్రామిక రంగంలో రాష్ట్ర ప్రగతిని ప్రపంచంలో చాటాలి
- జగన్ రాగానే పీపీఏ రద్దు చేశారు
- పరిశ్రమలు స్థాపన.. విస్తరణకు ప్రాధాన్యత
- పారిశ్రామికవేత్తగా సమస్యలపై అవగాహన ఉంది
- పరిశ్రమల శాఖను ఇవ్వడం మరువలేని సంతోషం
- ఓర్వకల్లు మెగా పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తా
- చంద్రబాబు, లోకేశ్ నమ్మకాన్ని నిలబెడతా
- ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి: సీఎం చంద్రబాబు మంత్రివర్గంలో స్థానం దక్కడం.. కీలకమైన పరిశ్రమలు, వాణిజ్య, ఆహార శుద్ధి శాఖను అప్పగించడంపై మీ అనుభూతిని వివరిస్తారా..?

● టీజీ భరత్: అక్షరాలతో వర్ణించలేని, మాటల్లో చెప్పలేని సంతోషం ఇది. ఎమ్మెల్యేగా గెలిచిన ప్రతి ఒక్కరికీ మంత్రి కావాలనే స్వప్నం ఉంటుంది. నేనూ కలగనడం సహజమే. ఆ కలను ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ సాకారం చేశారు. పారిశ్రామికవేత్తగా నాకు అనుభవం ఉన్న పరిశ్రమల శాఖను కేటాయించడం జన్మలో మరవలేని ఆనందం.. గొప్ప సంతృప్తినిచ్చింది.

● పారిశ్రామివేత్త, సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు అయిన టీజీ వెంకటేశ్ సలహాలు పాలనలో తీసుకుంటారా..? మీరు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంపై తల్లిదండ్రులు, భార్య పిల్లలు ఎలా ఫీల్ అయ్యారు..!

● టీజీ: నేను ఈ రోజు మంత్రిగా మీ ముందు మాట్లాడుతున్నానంటే మా నాన్న టీజీ వెంకటేశ్ ప్రోత్సాహమే కారణం. ఆయన అనుభవం నాకు ఎన్నో పాఠాలు నేర్పించింది. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని సాధించడానికి పారిశ్రామికవేత్తగా, సీనియర్ రాజకీయ నాయకుడిగా మా నాన్న సలహాలు తప్పకుండా తీసుకుంటాను. సీఎం చంద్రబాబు ప్రధాని మోదీకి నన్ను పరిచయం చేయిస్తూ.. వీళ్ల నాన్న టీజీ వెంకటేశ్‌ను, భరత్‌ను రాజకీయాల్లో తీసుకొచ్చానని చెప్పారు. మంచి పొలిటీషియన్ అని చెప్పారు. మరువలేని క్షణాలు అవి. నాకు మంత్రి పదవి రావడం, ఎంతో ఇష్టమైన పరిశ్రమలు శాఖను చంద్రబాబు కేటాయించడం మా అమ్మానాన్నలు టీజీ రాజ్యలక్ష్మి, టీజీ వెంకటేశ్, నా భార్య శిల్పా, కుమారుడు విభూ, కూతురు ఆర్య సహా మా అక్కలు జ్యోత్స్న, మౌర్య, బావలు ఎంతో సంతోషించారు. నేను ప్రమాణ స్వీకారం చేసిన రోజు ఇంట్లో పండుగ వాతావరణ నెలకొంది.

● పరిశ్రమలు ఏర్పాటుకు ఎలాంటి అడ్డంకులు ఉన్నాయి..? వాటిని ఎలా పరిష్కరిస్తారు..?

● టీజీ: రాష్ట్ర విభజన తరువాత నవ్యాంధ్ర రూ.6 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ఏర్పడింది. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు తన పాలన అనుభవంతో రాష్ట్రాన్ని గట్టెక్కించడమే కాకుండా పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహం అందించారు. నాడు చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ దావోస్ వెళ్లి ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆంధ్రప్రదేశ్ సత్తా ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలకు తెలియజేశారు. అమెరికాలోని అయోవా విశ్వవిద్యాలయానికి వెళ్లి విత్తన రంగంలో సాంకేతిక పరిజ్ఞానం ఇవ్వాలని కోరారు. ఫలితంగా రాష్ట్రానికి కియోలాంటి ఎన్నో పరిశ్రమలు వచ్చాయి. రాయలసీమలో సోలార్ పవర్ ప్లాంట్లను ప్రోత్సహించారు. మన దురదృష్టం కొద్ది 2019లో జగన్ ప్రభుత్వం రాగానే పీపీఏలు రద్దు చేసి పారిశ్రామికవేత్తల్లో భయాందోళన కలిగించారు. ఈ రంగాన్ని నిర్వీర్యం చేశారు. అమరాజా లాంటి ఎన్నో పరిశ్రమలు తెలంగాణ, తమిళనాడుకు తరలిపోయాయి. పరిశ్రమలు రావాలంటే రాయితీలు, పవర్, నీరు, ల్యాండ్, అనుమతులు ఎంతో కీలకం. ఒక కాల వ్యవధిలో... సింగిల్ విండో విధానంలో ఇవి అందించాలి. మేమున్నామనే భరోసా ఇవ్వాలి. వీటిపై అధ్యయనం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని సాధించేందుకు నా వంతు కృషి చేస్తాను.



రాష్ట్రంలో పారిశ్రామిక రంగం ప్రగతికి ఎలాంటి కృషి చేస్తారు..?

● టీజీ: పారిశ్రామికవేత్తగా కొత్త పరిశ్రమలు ఎలా తీసుకురావాలి, ఉన్నవి ఎలా విస్తరించాలి, పారిశ్రామికవేత్తలు ఎదుర్కొనే సమస్యలు ఎలా పరిష్కరించాలి? అనే విషయాలపై నాకు సంపూర్ణ అవగాహన ఉంది. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టగానే రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపనకు పలువురు ఆసక్తి చూపుతున్నారని స్పష్టత వచ్చింది. వారికి ధైర్యం, భరోసా ప్రభుత్వం ఇవ్వాలి. చైనా, సింగపూర్ తరహాలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటు చేసేలా కృషి చేస్తాను. ముఖ్యంగా రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాల్లో అవగాహన పెంచుకొని స్థానిక వనరుల ఆధారంగా ఏ జిల్లాలో ఎలాంటి పరిశ్రమ ఏర్పాటు చేయవచ్చు అనే అంశంపై అధ్యయనం చేస్తాను. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి గుజరాత్ తరహాలో పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాను. మన రాష్ట్రం సత్తాను ప్రపంచానికి చాటుతా.

● ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ కోసం ఎలాంటి ప్రణాళిక అమలు చేస్తారు..?

● టీజీ: గత టీడీపీ ప్రభుత్వం 33 వేల ఎకరాల్లో ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసింది. దాదాపుగా 80 వేల ఉద్యోగాలు కల్పించేలా రూ.80 వేల కోట్లతో వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసేలా పలువురు పారిశ్రామికవేత్తలతో ఎంవోయూ చేసుకున్నారు. జగన్ వచ్చాక పట్టించుకోలేదు. చంద్రబాబు శంకుస్థాపన చేసిన జైరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్ ఒక్కటే నిర్మాణ పనులు చివరికి వచ్చాయి. జగన్ ప్రభుత్వ విధానం వల్ల నిర్మాణ వ్యయం పెరిగి వారు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. ఎవరెవరు ఎంవోయూలు చేసుకున్నారో వారితో చర్చించి పరిశ్రమలు ఏర్పాటు చేసేలా కృషి చేస్తాను.



ఆంధ్రజ్యోతి పత్రికను చదువుతున్న మంత్రి టీజీ భరత్

హైదరాబాద్-బెంగళూరుకు మధ్యలో జిల్లా ఉండడంతో పరిశ్రమలు రావడానికి అనుకూలంగా ఉంది.

● ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై శ్రద్ధ పెడతారా..?

● టీజీ: ఎమ్మిగనూరులో చేనేతలు అధికంగా ఉండడంతో టెక్స్‌టైల్ పరిశ్రమలు, ఆదోనిలో కాటన్ మార్కెట్ కేంద్రంగా పత్తి జిన్నింగ్ పరిశ్రమలు, పత్తికొండలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్, కోవెలకుంట్ల, బనగానపల్లె, డోన్ ప్రాంతాల్లో సిమెంట్, గ్రానైట్ పరిశ్రమలు, నందికొట్కూరు, నంద్యాల ప్రాంతాల్లో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అనుకూలతలు ఉన్నాయి. పరిశ్రమలు ఏర్పాటుపై అధ్యయనం చేయాలి. ఆ తరువాత సీఎం చంద్రబాబుతో చర్చించి ముందుకు వెళ్తాం. ముఖ్యంగా మా ఎమ్మెల్యేలతో చర్చించి వారి ప్రతిపాదన మేరకు ముందుకు వెళ్తాం.



● జిల్లాలో ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకొని మంత్రిగా ఎలా ముందుకు వెళ్తారు..?

● టీజీ: ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గల దస్తగిరితో స్నేహపూర్వక అనుబంధం ఉంది. విజయోత్సవ ర్యాలీకి హాజరయ్యారు. విజయవాడలో ఉన్నందున రాలేకపోతున్నానని బీవీ చెప్పారు. కూటమికి చెందిన ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధితో కూడా మంచి అనుబంధం ఉంది. వారందరినీ కలుపుకొని వారి అభిప్రాయం మేరకే వారి నియోజకవర్గాల్లో ముందుకు వెళ్తాం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. మాది చంద్రబాబు, నారా లోకేశ్ టీం. సమన్వయం, సమష్టి నిర్ణయాలతో సక్సెస్ వైపే ముందుకు వెళ్తాం. ఏక పక్ష నిర్ణయాలు తీసుకునే ప్రసక్తే ఉండదు.

స్నేహితులను బలిగొన్న రోడ్డుప్రమాదం

- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కంటైనర్
- ఇంటర్ విద్యార్థి, యువకుడి దుర్మరణం
- శోకసంద్రంలో బాధిత కుటుంబ సభ్యులు



శివ (ఫైల్)



గురుస్వామి(ఫైల్)



ప్రమాదానికి కారణమైన కంటైనర్

ఎమ్మిగనూరు జూన్15: ఎమ్మిగనూరు పట్టణంలోని 167వ జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ ఇంటర్ విద్యార్థి, 20 ఏళ్ల యువకుడు దుర్మరణం చెందారు. స్థానికులు, పట్టణ పోలీసులు వివరాల మేరకు.. ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లు గ్రామానికి చెందిన మాల మునిస్వామి, పార్వతిలకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. ఇందులో రెండో కుమారుడు మాల శివ(18) కడివెళ్ల మోడల్‌స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అలాగే నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన నాగేంద్ర, జయలక్ష్మిలకు ముగ్గురు కుమారులు. ఇందులో రెండో కుమారుడు గురుస్వామి(20) ఎమ్మిగనూరు పట్టణంలోని ఓ బేకరీ దుకాణంలో పని చేస్తున్నాడు. మాలశివ, గురుస్వామిలు ఇద్దరు మిత్రులు. శనివారం వీరిద్దరు మోటారు సైకిల్‌పై మంత్రాలయం వైపు వెళ్తుండగా విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర వెనుక నుంచి వస్తున్న భారీ కంటైనర్ వారిని ఢీకొంది. దీంతో ఇరువురు కంటైనర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం చేరవేశారు. యువకులను ఢీకొట్టిన కంటైనర్‌ను డ్రైవర్ కొంత దూరంలో వాహనాన్ని ఆపి అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం రోడ్‌సేఫ్టీ వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బంధువులకు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. బంధువుల రోదనలతో ఆస్పత్రి ప్రాంగణం మిన్నంటింది. పట్టణ ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి మరణవార్తతో వెనుతిరిగిన తండ్రి: గుడికల్లు గ్రామానికి చెందిన మునిస్వామి భార్యా పిల్లలను ఊళ్లోనే ఉంచి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాదుకు వలస వెళ్తుంటాడు. శివను కడివెళ్ల మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్పించిన అనంతరం శనివారం హైదరాబాదుకు బయల్దేరి వెళ్లాడు. అయితే మార్గమధ్యంలోనే తన కుమారుడు శివ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడనే వార్త అందింది. దీంతో రోదిస్తూ అక్కడి నుంచి వెనుతిరిగాడు. కళాశాలలో చేరిన రెండు, మూడు రోజులకే శివ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో మోడల్ స్కూల్ విద్యార్థుల్లో కూడా విషాదం నెలకొంది.

19, 20 తేదీల్లో కరువు బృందం రాక

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 15: కేంద్ర కరువు బృందం ఈ నెల 19, 20 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తుందని డీఆర్వో మధుసూదన్‌రావు తెలిపారు. శనివారం డీఆర్వో చాంబర్‌లో కేంద్ర కరువు బృందం పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ కరువుకు సంబంధించిన ఫొటోలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో రైతులతో కరువు విషయాలు వెల్లడించేలాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కంది పంట నష్టపోయిన మద్దికెర, ఆలూరు తదితర మండలాల సంబంధిత వ్యవసాయాధికారులు పశుసంవర్ధక శాఖ వ్యవసాయ సిబ్బంది గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది వివరించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే ఫొటో ఎగ్జిబిషన్ పనులను డీపీఆర్‌వో పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, సీపీవో హిమ ప్రభాకర్ రాజు, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన పూజకు బంగారు పీఠాలు

మంత్రాలయం, జూన్ 15: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో నిత్యం జరిగే సంస్థాన పూజల్లో మూల రాముల పూజలకు ఉపయోగించేందుకు పీఠాలను, రెండు ధ్వజారోహణలు, కిరీటాలను నిర్మాణం చేశారు. శనివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు బంగారు పీఠాలకు పూజలు చేసి హారతులు ఇచ్చారు. విలువైన బంగారు పీఠాలను పూర్ణబోధ పూజా మందిరంలో జరిగిన మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములను పీఠాలపై ఉంచి బంగారు నాణేలతో అభిషేకించి హారతులు ఇచ్చారు. బంగారు పీఠాలపై ఆసీనులపై దేవతామూర్తులకు తులసి అర్చన, మంగళహారతులు ఇచ్చారు. బంగారు పీఠాలపై స్వామివార్లు ఆసీనులు కాగా భక్తులు చూసి ఆనంద పరవశులయ్యారు.

బొమ్మిరెడ్డిపల్లి హత్య కేసులో నిందితుల అరెస్ట్?

వెల్దుర్తి/పత్తికొండ, జూన్ 15: వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది. మే 13న జరిగిన ఎన్నికల సందర్భంగా టీడీపీ-వైసీపీల వర్గాల నడుమ చోటుచేసుకున్న వివాదం హత్యకు దారి తీసింది. గ్రామానికి చెందిన మోదుపల్లి గిరినాథ్ చౌదరి తన తమ్ముడు కళ్యాణచక్రవర్తితో కలిసి దళితవాడ వైపు వెళ్తున్న సమయంలో వైసీపీ వర్గీయులు వేటకొడవళ్లతో దాడి చేశారు. గిరినాథ్ చౌదరి అక్కడికక్కడే మృతి చెందగా ఆయన తమ్ముడు కళ్యాణచక్రవర్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులోభాగంగా హత్య కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేసి మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు సమాచారం.

క్షుద్రపూజల కలకలం..

- ఆకులు, కుంకుమ, పసుపు, నిమ్మకాయలతో పూజలు
- ఆందోళనలో వైద్యవిద్యార్థులు



కర్నూలు జీజీహెచ్‌లోని డైట్ కేంద్రంలో క్షుద్రపూజలు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 15: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో క్షుద్ర పూజలు కలకలం రేపుతున్నాయి. ఆసుపత్రిలోని డైట్ (రోగుల భోజనశాల) ఎదుట ఉన్న రహదారి మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి క్షుద్ర పూజలు చేసినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో కుంకుమ, ఆకులు, వక్కచీటి, ఎర్రని, నల్లని దారాలు, రూపాయి బిల్లలు, నిమ్మకాయలు కోసి వదిలి పెట్టిన ఆనవాళ్లు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఆనవాళ్లు ఉన్నాయి. మధ్యాహ్న భోజనం కోసం వచ్చిన వైద్యవిద్యార్థులు ఈ పూజలను చూసి ఆందోళన చెందారు. డైట్ కేంద్రంలో రాత్రి పూట వీధి లైట్లు వెలగకపోవడం, చీకట్లు కమ్ముకోవడం వల్ల కొందరు క్షుద్ర పూజలు చేసినట్లు వైద్యవిద్యార్థులు చెబుతున్నారు.

వైద్య విద్యార్థుల ర్యాలీ

రాజ్‌విహార్‌లో మానవహారం

కర్నూలు(హాస్పిటల్), జూన్ 15: కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. రోడ్లపై వాహనాల స్పీడ్‌ను నియంత్రించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరుతూ 700 మంది వైద్య విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజ్‌విహార్‌లో దాదాపు 2 గంటలు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డా.అచ్యుత్, వైస్ ప్రెసిడెంట్ డా.భార్గవ్, డా.సతీష్ మాట్లాడుతూ కర్నూలు జీజీహెచ్ నుంచి రాజ్‌విహార్ రోడ్డు చాలా బిజీగా ఉంటుందని, ఆసుపత్రి, మసీదు, పెట్రోల్ బంకు, ఏటీఎం, బ్యాంకు, మెడికల్ కాలేజీ ఇలా రద్దీ ఉన్న రోడ్డులో వాహనాలు, బస్సులు, ఆటోల స్పీడ్‌ను నియంత్రించాలని కోరారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న సర్కిల్‌లో 24 గంటలు ట్రాఫిక్ పోలీసులు రద్దీని నియంత్రించాలని కోరారు. ఈ సర్కిల్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసి వైద్య విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించాలన్నారు. ఆసుపత్రి నుంచి రాజ్‌విహార్ వరకు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలని, మృతి చెందిన వైద్యవిద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. కర్నూలు మెడికల్ కాలేజీ నుంచి మసీదు, పెట్రోల్ బంకు వరకు రోడ్డు ఇరుకుగా ఉందని దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.



రాజ్‌విహార్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించిన వైద్య విద్యార్థులు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు

- హామీ ఇచ్చిన టీజీ భరత్
- మంత్రిని సన్మానించిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు



రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్‌ను సన్మానిస్తున్న ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కర్నూలు(కల్చరల్), జూన్ 15: అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం పట్టాలు, అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చేందుకు సహకరిస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ హామీ ఇచ్చారు. శనివారం నగరంలోని నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ సమావేశ హాలులో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్‌ను ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఐజేయూ జాతీయ సమితి సభ్యులు గోరంట్ల కొండప్ప, కే నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాసగౌడ్, కోశాధికారి అంజి, సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ హరికిషన్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి, వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు స్నేహాల్ తదితరులు ఇందులో ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల న్యాయమైన సమస్యలు తప్పక పరిష్కరిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎంపీ బైరెడ్డి శబరి


ఎస్పీకి పూల బొకే ఇస్తున్న బైరెడ్డి శబరి

కల్లూరు, జూన్ 16: కర్నూలు జిల్లా కలెక్టర్ జి.సృజన, ఎస్పీ కృష్ణకాంత్‌లను నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్న బైరెడ్డి శబరి కలెక్టర్‌కు పూలబోకే అందించగా ఆమె ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎస్పీకి బైరెడ్డి శబరి పూలబోకే అందించగా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలు ఎంపీ నాగరాజుకు అభినందనలు


ఎంపీ నాగరాజును అభినందిస్తున్న పెరుగు పురుషోత్తంరెడ్డి

కల్లూరు, జూన్ 16: కర్నూలు జిల్లా పార్లమెంట్ సభ్యుడిగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన బస్తిపాటి నాగరాజును కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి అభినందించారు. శనివారం తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్‌తో కలిసి ఆయన ఎంపీకి పూలబోకే అందించారు. కర్నూలు జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని ఎంపీ బస్తిపాటి నాగరాజు స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కోశాధి కారి పీయూ.మాదన్న, సల్కాపురం దేవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

'గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయండి'

కర్నూలు(కల్చరల్), జూన్ 15: గోవధ నిషేధ చట్టాన్ని జిల్లాలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నాయకులు డిమాండ్ చేశారు. రానున్న బక్రీద్ సందర్భంగా గో అక్రమ రవాణ, గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు, కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, కర్నూలులోని ఐదు పోలీసు స్టేషన్ల అధికారులకు, జిల్లా పశువైద్యాధికారులకు, నగరపాలక సంస్థ కమిషనర్‌కు, రవాణా శాఖ అధికారులకు వారు వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ హిందువులు గోమాతను పూజిస్తారని అన్నారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాశ్ మాట్లాడుతూ గోహత్యలను ఇక ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమన్నారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ విభాగ్ కన్వీనర్ నీలి నరసింహ, వీహెచ్‌పీ జిల్లా నాయకులు గోవిందరాజులు, ఈపూరి నాగరాజు, బజరంగ్ దళ్ నాయకులు భగీరథ, హరికృష్ణ, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

పన్నులను రద్దు చేయాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 15: గత ఐదేళ్లలో ప్రజలకు భారంగా మారిన కరెంటు చార్జీలు, ఇంటి పన్నులను రద్దు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. బిల్డర్ అసోషియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కేఈ జగదీష్ అధ్యక్షతన శనివారం బీఏఎస్ కల్యాణ మండపంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశానికి సీనియర్ న్యాయవాది నాగేంద్రనాథ్, ప్రైవేటు విద్యాసంస్థల సంఘం రాష్ట్ర ప్రతినిధి రవీంద్ర పుల్లయ్య, ఐఎంఏ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు డా.రాహుల్, సంఘం రాష్ట్ర సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ఆస్తి విలువపై పన్ను విధించే విధానం వల్ల ఆస్తి విలువ పెరిగినప్పుడల్లా ఇంటి పన్నులు పెరుగుతున్నాయన్నారు. దీనికితోడు విద్యుత్ బిల్లులపై 8 రకాల అదనపు చార్జీలు వేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో పెట్రోలు బంకుల యజమానుల సంఘం ప్రతినిధి రంగస్వామి, మహేష్ పాల్గొన్నారు.

మంత్రి టీజీ భరత్‌కు అభినందనల వెల్లువ


టీజీ భరత్ దంపతులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు, బ్రాహ్మణ సంఘం నాయకులు

కర్నూలు(అర్బన్), జూన్ 15: రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్‌ను శనివారం పలువురు కలిశారు. టీజీ భరత్ కార్యాలయంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డి, ఎస్పీ కృష్ణకాంత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పరిశ్రమల శాఖ జెడ్ఎం సోమశేఖరరెడ్డి, జీఎం ప్రసాద్, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, అడిషనల్ ఎస్పీ సుధీర్‌బాబు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ, మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి బీ. సుధీర్ ప్రేమ్ కుమార్, మెప్మా పీడీ నాగశివలీల, డీపీఓ నాగరాజు, డీఎస్‌డీవో భూపతి రావ్, ఇరిగేషన్ డీఈ రాజన్‌బాబు, జిల్లా కోర్టు మానిటరింగ్ సీఐ రామయ్య నాయుడు, డాక్టర్లు పి. చంద్రశేఖర్, భవానీ ప్రసాద్, ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్ తదితరులు మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ పెంపు ఘనత చంద్రబాబుదే: టీజీ: విభిన్న ప్రతిభావంతులకు పింఛన్ రూ.4 వేల నుంచి రూ.6వేలకు పెంచిన ఘనత చంద్రబాబుదేనని మంత్రి టీజీ భరత్ అన్నా రు. శనివారం నగరంలోని మౌర్యాఇన్ సమీపంలో నారా చంద్రబాబు నాయుడు చిత్రటానికి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఎల్లప్ప అధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ వృద్ధులు, మహిళలు, విభిన్న ప్రతిభావంతులకు ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం బాధ్యతలు తీసుకున్న రోజు వాటిని అమలు చేసిన ఏకైన వ్యక్తి చంద్రబాబు నా యుడేనని కొనియాడారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల జీవితాలతో ఆడుకున్న జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. కార్యక్రమంలో టీడీపీ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మద్దిలేటి, మక్బూల్ బాషా, జేఏసీ నాయకులు నాగరాజు, ఆదోని ఈరన్న, జోన్ శివశంకర్ పాల్గొన్నారు.

కర్నూలు(కల్చరల్): టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పూర్వ వైభవం కల్పించాలని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి నాయకులు రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం టీజీ భరత్‌ను వారు ఆయన కార్యాలయంలో కలిసి, ఆయన పరిశ్రమల, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా పేద బ్రాహ్మణులకు ఆర్థిక చేయూత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు సముద్రాల శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కళారంగానికి సహకరిస్తా: మంత్రి టీజీ : జిల్లాలో కళారంగం పురోభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం సంకల్‌బాగ్‌లోని మంత్రి నివాసంలో టీజీవీ కళాక్షేత్రం కళాకారుల పక్షాన కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మంత్రి టీజీ భరత్‌ను శాలువ కప్పి సత్కరించారు. జిల్లాలో కళారంగ అభివృద్ధిపై టీజీ భరత్ మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం పక్షాన నిత్యం కార్యక్రమాలు నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్నామని గుర్తు చేశారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాల ద్వారా కళాకారులకు తన వంతు సహాయం అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

● ఉత్తరాది మఠంలో పూజలు: కర్నూలు నగరంలోని పెద్ద మార్కెట్‌లో ఉన్న ఉత్తరాది మఠాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ సందర్శించి పూజలు చేశారు. వేద పండితులు మంత్రిని ఆశీర్వదించారు.

టీజీ భరత్ దంపతులకు వేద పండితుల ఆశీర్వాదాలు: రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా పదవి బాధ్యతలను చేపట్టిన టీజీ భరత్‌ను శనివారం నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వేద పండితులు, బ్రాహ్మణ సంఘం నాయకులు కలిశారు. మంత్రి టీజీ భరత్ దంపతులకు వేద పండితులతో ఆశీస్సులు అందజేసి, జ్ఞాపికను ప్రదానం చేశారు. మంత్రి టీజీ భరత్ జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయించి, నిరుద్యోగ సమస్య లేకుండా చేసి, జిల్లా అభివృద్ధికి పాటుపడాలని, ఆయన కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశీస్సులు అంద జేశారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్య క్షుడు కల్లే చంద్రశేఖర్ శర్మ, నగర బ్రాహ్మణ, అర్చక, పురోహిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సుమంత్ శెట్టి ఆధ్వర్యంలో శనివారం పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓర్వకల్లు మండలాన్ని గతం లోనే చంద్రబాబు నాయుడు ఇండస్ట్రీయల్ హబ్‌గా తీర్చిదిద్దారన్నారు. ఓర్వకల్లు మండలానికి పరిశ్రమలు వచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్ గౌడు, భరత్‌గౌడు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

కర్నూలు(న్యూసిటీ): మంత్రి టీజీ భరత్‌ను ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం నగరంలోని న్యూ కౌన్సిల్ హాలులో నగర పాలక సంస్థ ఉన్నతాధికారులతో మంత్రి టీజీ భరత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

● జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఫోటో వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మీసాల రామస్వామి కోరారు. కౌన్సిల్ హాలులో మంత్రి టీజీ భరత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని, 3 సెంట్లు స్థలం ఇవ్వాలని కోరారు. కార్యక్ర మంలో మధుసూదన్‌రెడ్డి, రామన్న, శాలన్న, ప్రసాద్, విజయ్ పాల్గొన్నారు.

● తొలగించిన కాంట్రాక్టు షిల్డ్ కార్మికులకు విధుల్లోకి తీసుకోవాలని టీఎ న్‌టీయూసీ అధ్యక్షుడు వైవీ రమణ కోరారు. న్యూ కౌన్సిల్ హాలులో మంత్రి టీజీ భరత్‌కు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎం.నారాయణ, కార్మికులు ఉన్నారు.


మంత్రి టీజీ భరత్‌కు అభినందనలు తెలుపుతున్న గౌరు దంపతులు


మంత్రి టీజీ భరత్‌కు అభినందనలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఎస్పీ కృష్ణకాంత్


టీజీ భరత్‌ను అభినందిస్తున్న హుసేనాపురం టీడీపీ నాయకులు


చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న విభిన్న ప్రతిభాంతులతో మంత్రి టీజీ భరత్

మంత్రి ఫరూక్‌కు అభినందన


ఫరూక్‌ను సన్మానిస్తున్న సోమిశెట్టి

కర్నూలు(అర్బన్), జూన్ 15: మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నంద్యాలలోని తన నివాసంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు శనివారం కలిసి ఆయన్ను సన్మానించారు. ఈసందర్భంగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చంద్రబాబు అత్యంత బాధ్యతతో కేటాయించిన న్యాయ, మైనార్టీ శాఖలతో ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఫరూక్‌ను కలిసిన వారిలో టీడీపీ నాయకులు సోమిశెట్టి నవీన్, కిషోర్, సత్రం రామక్రిష్ణుడు, శ్యామ్ సుందర్ లాల్, బంగి సుందర్శన్ ఉన్నారు.

ప్రణాళికతో చదువుకోవాలి

కర్నూలు(అర్బన్), జూన్ 15: విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి బీసుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. శనివారం ఆర్‌యూలోని సెనెట్ హాలులో మేనేజ్‌మెంట్ విద్యార్థులకు నిర్వహించిన క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్స్ ఇన్ మేనేజిమెంట్ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈకార్యక్రమానికి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ లక్నోలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న వెంకటరమణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపకులపతి మాట్లాడుతూ భవిష్యత్‌లో రానున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈసదస్సులో రెక్టార్ ఎన్‌టీకే నాయక్, మేనేజ్ మెంట్ విభాగం ప్రొఫెసర్ సీ.విశ్వనాథరెడ్డి, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు,

ఎంపీని కలిసిన ఎన్జీవో నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 15: కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజును శనివారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు కలిశారు. ఉద్యోగ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఎంపీ స్పందిస్తూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువె ళ్తామన్నారు. ఎంపీని కలిసి వారిలో దస్తగిరిరెడ్డి, జవహర్, కాశన్న, రామక్రిష్ణ, రాముడు, సత్యనారాయణ, మోహన్ రెడ్డి, హుశేన్ రెడ్డి, మద్దిలేటి, భాస్కర్ రెడ్డి ఉన్నారు.

విలువిద్య క్రీడతో ఏకాగ్రత

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 15: విలువిద్య క్రీడతో ఏకాగ్రత పెరుగుతుందని డీఎస్‌డీవో భూపతిరావు అన్నారు. శనివారం స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలువిద్య పోటీలకు ముఖ్యఅతిథులుగా డీఎస్‌డీవో భూపతిరావు, కర్నూలు జిల్లా విలువిద్య సంఘం కార్యదర్శి కె.నాగరత్నమయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు, పెద్దలకు విలువిద్య క్రీడ నేర్చుకోవడం వలన ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు విజయవాడలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కె.నాగరత్నమయ్య, శిక్షకులు వంశీకృష్ణ, భరత్, రాజు, సునీల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లకు స్థల పరిశీలన

కర్నూలు(న్యూసిటీ), జూన్ 15: రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు మళ్లీ ఏర్పాటు చేయాలని నూతన ప్రభుత్వం నిర్ణయించినందున కర్నూలు నగర పరిధిలో ఏర్పాటు చేసేందుకు శనివారం మున్సిపల్ నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సంబంధిత అధికారులతో కలిసి పలు ప్రాంతాలను సందర్శించారు. పాతబస్టాండు, కలెక్టరేట్, ప్రభుత్వ ఆసుపత్రి, సెట్కూరు కార్యాలయం, పరిమళ నగర్ తదితర ప్రాంతాలను పరిశీలించి కమిషనర్ త్వరగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎంఈ శేషసాయి, డీఈఈలు రవిప్రకాష్ నాయుడు, గిరిరాజు, రాజశేఖర్, ఏఈ దినేష్, ప్రవీణ్ కుమార్ రెడ్డి ఉన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

సి.బెళగల్, జూన్ 15: బడి ఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలని ఎంఈవో జ్యోతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు కావాలన్నారు.

ఇష్టంతో చదవాలి: ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, జూన్ 15: విద్యార్థులు ఇష్టంతో చదవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితమ్మ అన్నారు. శనివారం మండలంలోని నన్నూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఆమె మొక్కలు నాటారు. విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితమ్మ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో ఓంకార్‌యాదవ్, ప్రధానో పాధ్యాయుడు ప్రణేష్‌కుమార్, ఎంపీడీవో మల్లీశ్వరి, తహసీల్దార్ నటరాజ్, ఎస్‌టీసీ జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, జాతీయ మహిళా హక్కుల రాష్ట్ర అధ్యక్షురాలు అనీషా పాషా, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, ఆకుల మహేష్, సర్కార్, ఖాజామియా, విజయుడు, ప్రతాప్ రెడ్డి, సుధాకర్‌రావు, లక్ష్మీకాంతరెడ్డి, సర్దార్ బేగ్, రామకో టేశ్వరరావు, ఎం.హనీఫ్‌బేగ్ పాల్గొన్నారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థి కిట్లు పంపిణీ జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న గౌరు చరిత

గూడూరు: మండలంలోని జులకల్ గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఎంఈవో నాగరాజు విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు.

మెరుగైన వైద్యం అందించండి



పీజీ డాక్టర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 15: పీజీ వైద్యులు రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ అన్నారు. శనివారం న్యూలెక్చర్ గ్యాలరీలో పోస్టు గ్రాడ్యుయేట్ వైద్యులకు ఎంసీఐ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పీజీ వైద్యులు తమ వైద్యంలో ప్రతి పనికి రికార్డు మెయింటెన్ చేయాలన్నారు. మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ కోఆర్డినేటర్, కమ్యూనిటీ మెడిసిన్ ఇన్‌చార్జి హెచ్‌వోడీ డా.సింధియా శుభప్రద, వైద్యులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 15: ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో అనావృష్టితో రైతులు సాగు చేసిన పంటలన్నీ నేలమట్టమయ్యాయని, అయితే.. గత ప్రభుత్వం మాత్రం అరకొరగా నష్టపరిహారాన్ని అందించేందుకు నిర్ణయం తీసుకోవడం దారుణమని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కర్నూలు నగరంలోని రైతు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో కేవలం 18 మండలాలు, అదేవిధంగా నంద్యాల జిల్లాలో 13 మండలాల్లో మాత్రమే గత ఖరీఫ్‌లో రైతులు పంటలు నష్టపోయారనీ ప్రభుత్వం పేర్కొనడం దారుణమన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 15: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూళ్లు చేస్తున్నారని, వాటిని అరికట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌కు ఏఐవైఎఫ్ నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి మాట్లాడుతూ జీవో.నెం.1 ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వసూళ్లు చేసిన మొత్తంలో 50 శాతం ఉపాధ్యాయులకు జీతాల కింద చెల్లించాలన్నారు. అయితే పాఠశాలల యాజమాన్యాలు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ అక్రమార్జనకు పాల్పడు తున్నారని ఆరోపించారు. డీఈవోకు వినతి అందజేసిన వారిలో నగర కార్యదర్శి బీసన్న, నాగేశ్వరరావు ఉన్నారు.

మెగా డీఎస్సీ ముందు టెట్ పరీక్ష నిర్వహించాలి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీపై సంతకం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆప్టా నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ టీచర్ల అసోసియేషన్ అధ్యక్షుడు గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రావు, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు విద్యాశాఖ అధికారులకు వినతి సమర్పించారు.

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన టీడీపీ నాయకులు


ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, జూన్ 15: కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని ఆర్ ఖానాపురం టీడీపీ నాయకులు కలిశారు. శనివా రం మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్‌బాబు ఆధ్వర్యంలో ఆర్ ఖానా పురం టీడీపీ నాయకులు కర్నూలు ఎంపీ నాగరాజును, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరిని కలిసి శాలువ కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిస్వామి, ఆర్ ఖానాపురం టీడీపీ నాయకులు మన్యంకొండ, కృష్ణ, దస్తగిరి, సుంకన్న, నరసింహులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

సి.బెళగల్, జూన్ 15: బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ తిమ్మారెడ్డి ముస్లింలకు సూచించారు. శనివారం సి.బెళగల్‌లోని పోలీసు స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో ఎస్ఐ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ బక్రీద్‌ను పురస్కరించుకుని ముస్లింలు గోవును వధించరాదన్నారు. ఈసమావేశంలో ఉస్మాన్ బాషా, మౌలానమహ్మద్, మహబుబ్‌దౌల, ఎస్ఎం బాషా, ఇబ్రహీమ్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ముస్లిం మత పెద్దలకు కర్నూలు రూరల్ సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐ రాజారెడ్డి సూచించారు. శనివారం ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ఇటుక పడి విద్యార్థి తలకు గాయం

కోడుమూరు (రూరల్), జూన్ 15: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో విద్యార్థి తలపై ఇటుక పడడంతో తీవ్రగాయమైంది. గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న పెరుమాళ్ తేజ శనివారం మధ్యాహ్న భోజనానికి ఇంటికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అంబేద్కర్ విగ్రహం దగ్గర లారీ నుంచి ట్రాక్టర్‌లోకి ఇటుకలు మార్చుతుండగా.. అటు వైపు వెళుతున్న విద్యార్థి తలపై ఇటుక పడింది. దీంతో తేజకు తీవ్రగాయమైంది. తల్లిదండ్రులు బాలుడ్ని కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం పట్ల పోలీసులకు వారు ఫిర్యాదు చేశారు.



గాయపడిన విద్యార్థి, ప్రమాదానికి కారణమైన ఇటుకల లారీ

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

ఆదోని రూరల్, జూన్ 15 : ఆదోని మండలంలోని సమస్యాత్మక గ్రామాలైనా అలసందుగుత్తి, కపటి, సంతేకుడ్లూరు, బసాపురం గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం సీఐ మాట్లాడుతూ ఈ గ్రామాలపై తమ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తుంటారని, ఘర్షణలకు పాల్పడిన, అందుకు కారకులైన వారిని ఊపేక్షించేది లేదని చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కరపత్రాలు విడుదల

ఆదోని రూరల్, జూన్ 15 : ఆదోని మండలం విరుపాపురం గ్రామంలో ఈనెల 18 నుంచి 24వరకు తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక అంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ధర్మ ప్రచార మండల న్యాయకంతి భీమ్‌రెడ్డి తెలిపారు. శనివారం గ్రామస్తులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

ఆదోని రూరల్, జూన్ 15 : గ్రామాల అభివృద్ధి చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా బైచిగేరి, నాగనాథనహళ్ళి, సంతేకుడ్లూరు, బసాపురం గ్రామ పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను ఎమ్మెల్యే స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 75శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25శాతం నిధులతో గ్రామాల్లో పారిశుధ్య పనులకు ఇతరాత్ర పంచాయతీ పనుల కోసం ట్రాక్టర్లను మంజూరు చేసిందని, ఒక ట్రాక్టర్ విలువ రూ.6లక్షల 50 వేలు అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, ఈఓపీఆర్‌డీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, కృష్ణ, వేణుగోపాల్‌రెడ్డి, ఓం ప్రకాష్, మల్లి, మాజీ ఎంపీపీ పంపాపతి, మధు, ప్రసాద్, నాగరాజు గౌడ్, ఆచారిలు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించడం శుభ పరిణామం

మద్దికెర, జూన్ 15: టీడీపీ కూటమి ఎన్నికల హామీలో నిరుద్యోగులకు ఇచ్చిన మెగా డీఎస్సీ హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన వెంటనే తొలి సంతకం చేయడం శుభపరిణామమని తాలుకా తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఎన్.చంద్రమోహన్, మాజీ పంచాయితీ సభ్యులు రాముడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఎన్.ఉదయ్ కుమార్ అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ డీఎస్సీ పై తొలి సంతకంతో పాటు ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటీన్లు పునరుద్ధరణ, సామాజిక పించన్లు పెంపు, నైపుణ్య గణన ఫైళ్లపై సంతకాలు చేసి అన్ని వర్గాలకు న్యాయం చేశారన్నారు.

ప్రజా సేవకే పట్టం

● కోట్లను సన్మానించిన టీడీపీ నాయకులు

తుగ్గలి, జూన్ 15: కోట్ల కుటుంబం ప్రజాసేవకే వారి జీవితాలను అంకితం చేశారనీ ప్రజలు ప్రజాసేవకే పట్టం కట్టారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు అన్నారు. శనివారం డోన్‌లో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కోట్ల సుజాతమ్మ దంపతులను శాలువా కప్పి, పూల మాలలు వేసి సన్మానం చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచకాలు మితిమీరిపోవడంతోనే ప్రజలు మార్పు కోరుకున్నారని, అందుకే టీడీపీ కూటమి 164 సీట్లు విజయం సాధించారన్నారు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మే వెంకటేశ్, వెంకటస్వామి, మాభాషా, హనుమంతరెడ్డి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలి

మద్దికెర, జూన్ 15: మండలంలోని ఎరువులు, దుకాణాల్లో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, మందులను విక్రయించాలని ఏడీఏ విజయకుమార్ అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ సహాయకులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న కేంద్ర కరువు బృందం మద్దికెర మండలంలో పర్యటించి రైతులతో సమావేశం అవుతారన్నారు. రైతులకు సమావేశ వివరాలను అందించాలన్నారు. అనంతరం స్థానిక భీమలింగప్ప ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాశాఖ అధికారి ఉప్పర రవి, వ్యవసాయ సహాయకులు జాకీర్, ఆనంద్, రాణి తదితరులు ఉన్నారు.

మద్దికెరలో రైళ్లు నిలపాలి

మద్దికెర, జూన్ 15: మద్దికెర స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని తెలుగు యువత తాలూకా అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్ గౌడు కోరారు. శనివారం ఆంధ్రజ్యోతిలో రాకపోకలు ఎలా అనే వార్తను ఎంపీ బస్తిపాటి నాగరాజు దృష్టికి కలిసి చూపించారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్దికెర రైల్వేస్టేషన్‌లో గత మూడేళ్ల నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లను అమరావతి, కాచిగూడ, యశ్వంత్‌పూర్ రైళ్లను నిలపడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మద్దికెర నుంచి కర్నూలు, కాచిగూడ, డోన్, విజయవాడ ప్యాసింజర్ రైళ్లు తిరగకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ ఉపాధ్యక్షుడు టైలర్ హరి, గోపాల్ ఉన్నారు.

7,8,9 తరగతుల ప్రవేశానికి దరఖాస్తులు

ఆలూరు, జూన్ 15: ఆలూరు మోడల్ స్కూల్లో 2024-25 మధ్య సంవత్సరానికి మిగిలిపోయిన సీట్లకు ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాఘవరావు శనివారం తెలిపారు. విద్యార్థులు అప్లికేషన్‌తో పాటు అధార్, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్‌లతోపాటు రెండు పాస్ ఫొటోలు జతపరచాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 24న ఉదయం 10 గంటలకు ఆలూరు మోడల్ స్కూల్‌లో రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. 7వ తరగతిలో 12 సీట్లు, 8వ తరగతిలో 12 సీట్లు, 9వ తరగతిలో 23 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జెండాలు తొలగించారని ఘర్షణ

తుగ్గలి, జూన్ 15: టీడీపీ, వైసీపీ పార్టీల జెండాలను తొలగించారని ఇరు వర్గాల జరిగిన ఘర్షణలో వైసీపీ కార్యకర్తకు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి మండలంలోని దిగువ చింతలకొండకు చెందిన వైసీపీకి చెందిన శ్రీనివాసులుపై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న జొన్నగిరి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమ్మితం వైద్యశాలకు తరలించారు. గ్రామంలో టీడీపీ, వైసీపీ జెండాలను తొలగించారనే ఘర్షణ జరిగిందని పోలీసులు వివరించారు.

యూజీడీపై నిర్ణయం తీసుకుంటాం

● జీడీపీ పైపులైన్ పూర్తి చేసేందుకు చర్యలు
● శివారు కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ
● ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి పూర్వ వైభవం తెస్తా
● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి


ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, జూన్ 15: పట్టణవాసులు ఇబ్బంది పడకుండా యుజీడీపై సమీక్షించి ఒక నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తరువాత మొదటి రోజు శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులతో ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమవేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో టీడీపీ హయంలో పట్టణంలో ఏర్పాటు చేసిన మినీ నీటి ట్యాంకులు అనేక చోట్ల పాడైపోయాయని వాటి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో యుజీడీని 95 శాతం పూర్తి చేశానని, ఈ ఐదేళ్లలో 5శాతం గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందన్నారు.న్నారు. పట్టణానికి 24గంటలు తాగునీరు అందించేందుకు జీడీపీ పైపులైన్‌ను ఏడాదిన్నరలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఏ మేరకు నిధులు వచ్చాయి, ఏ మేరకు అభివృద్ధి జరిగింది అనేదాన్ని ప్రజలకు శ్వేతపత్రం ద్వారా తెలియజేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఎస్పీ సీతారామయ్య, డీఈ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

● సామాన్య ప్రజలు, వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు

ఎమ్మిగనూరు పట్టణంతో పాటు నియోజకవర్గంలో సామాన్య ప్రజలను, వ్యాపారులను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే సహించేదిలేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో పోలీసు అధికారులతో మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు, అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీఎస్సీపై తొలి సంతకం సహా ఐదు సంతకాలు చేశారని అన్నారు. ఎమ్మిగనూరు ప్రజల రుణం తీర్చుకునే అవకాశం ప్రజలు తనకు మరోసారి ఇచ్చారని ఎమ్మిగనూరు పట్టణం, నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండ కృషి చేస్తానని అన్నారు.

● మొదటి రోజే రూ.1.50కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ:

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మొదటి రోజే పట్టణాభివృద్ధికి తొలి అడుగులు వేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కలియతిరిగారు. కాలనీ వాసులు ఆయన దగ్గరికి వచ్చి ఆప్యాయంగా పలకరించారు. ఆయన ఓ చెట్టు నీడన కూచొని మహిళతో వారి సమస్యలపై మాట్లాడారు. పట్టణంలోని జోగికాలనీ, శివన్ననగర్, సోగనూరురోడ్డు, యల్లమ్మబీడు, ఎంఎస్ నగర్, సాయినగర్, 14వ వర్డులతో పాటు ఆయా ప్రాంతాల్లో రూ.1.50 కోట్లతో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, సీసీ డ్రైన్‌ల పది పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య చౌదరి, కౌన్సిలర్ రాందాసుగౌడు, మాజీ కౌన్సిలర్లు రంగస్వామిగౌడు, సుందర్‌రాజు, ముల్లాఖలీముల్లా, రామకృష్ణనాయుడు, చేనేత మల్లి, జయన్న, నాయకులు మిఠాయి నరసింహులు, వార్డుల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధి వైపు ఎమ్మెల్యే అడుగులు

ఎమ్మిగనూరు, జూన్15: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి నియోజకవర్గానికి వచ్చిన మొదటి రోజే పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా ఆయన నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని శివన్ననగర్‌లో కాలనీవాసుల సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

అధికారులపై రాజకీయ ఒత్తిడి ఉండదు

● ఎమ్మెల్యే పార్థసారథి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్ జూన్ 15: అధికారులపై రాజకీయ ఒత్తిడి లేకుండా చూస్తానని, ఎవరైనా తన పేరు చెప్పుకొని పైరవీలకు వస్తే పట్టించుకోవద్దని ఎమ్మెల్యే డా పార్థసారథి అన్నారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎవరికి ఏ సమస్య ఉన్నా నేరుగా తననే సంప్రదించాలని సూచించారు. పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్న నమ్మకంతోనే ప్రజలు తనను మంచి మెజారిటీతో గెలిపించారని అన్నారు. ప్రజల మనిషిగా, ప్రతి కుటుంబంలో సభ్యుడిగా ఉంటానని అన్నారు. తక్కువ కాలంలో ఎక్కువ అభివృద్ధి చేసి చూపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి కోసం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని, అభివృద్ధి విషయంలో పట్టణ చరిత్రను తిరగరాయడమే తన ధ్యేయమని అన్నారు. ఎంఈ వెంకట చలపతి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్యకర్తలందరికీ అండగా ఉంటాం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి


తిక్కారెడ్డికి మిఠాయిలు తినిపిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మంత్రాలయం, జూన్ 15: కర్నూలు జిల్లాలో టీడీపీ విజయం కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని పార్టీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శనివారం మంత్రాలయం టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి అధ్యక్షతన నాల్గవ సారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన చంద్రబాబునాయుడు కీలకమైన ఐదు హామీలపై సంతకాలు చేయడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లాతో పాటు మంత్రాలయం నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూజారి వ్యాసరాజాచార్, పూజారి గోపాలకృష్ణ స్వామి, ఎల్లారెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, విజయరామిరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, యేబు, ఎంపీటీసీలు మేకల వెంకటేశ్, రాజు, కొట్రేష్‌గౌడు, వెంకటపతిరాజు, చెన్నబసప్ప, ఆదోని టీడీపీ నాయకులు ఉమాపతి నాయుడు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పై సంబరాలు


ఆలూరులో సంబరాలు జరుపుకుంటున్న న్యాయవాదులు

ఆలూరు రూరల్, జూన్ 15: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతకం చేయడం పట్ల ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యాలయం నందు బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వాయుజ్యోత్తమరావు, శేక్షావలి ఆధ్వర్యంలో కేకు కట్ చేసి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిద్ధప్ప, కే రవి, మేకల వీరేశ్, రాజేష్, షాకీర్, చాంద్ బాషా పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును చంద్రబాబు నాయుడు రెండో సంతకం చేస్తూ రద్దు చేయడం హర్షణీయమని ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేంద్ర కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

రేషన్ పంపిణీలో ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దు

కోసిగి, జూన్ 15: ప్రజలకు అందించే రేషన్ పంపిణీలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని డిప్యూటీ తహసీల్దార్ శశిశేఖర్‌రావు అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వీఆర్వోలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ పంపిణీలో ప్రజలకు సక్రమంగా రేషన్ సరుకులు అందించాలని, ప్రభుత్వానికి ఎలాంటి చెడ్డ పేరు తీసుకురావద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీరాములు, తిక్కస్వామి, వీఆర్వోలు, రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు తదితరులు ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

నందవరం, జూన్ 15: మండలంలోని మిట్టాసోమాపురం క్రాస్ రోడ్డు దగ్గర వాహనాల తనిఖీలో భాగంగా ఎస్ఐ తిమ్మయ్య శనివారం కర్ణాటక మద్యంను పట్టుకున్నారు. సోమలగూడురు గ్రామానికి చెందిన వడ్డే వెంకటేష్, జంగం వీరయ్య దగ్గర నుంచి కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, వారి దగ్గర నుంచి మోటర్ సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయనతో పాటు హెచ్‌సీ రాముడు, సోమశేఖర్ , సమీవుల్లా ఉన్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళాలు


దాతలకు స్వామివారి ప్రసాదాలను అందిస్తున్న దృశ్యం

కౌతాళం, జూన్ 15: ఉరుకుంద ఈరన్న స్వామి వారికి శనివారం రోజున భక్తులు దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి రూ.1.5లక్షల నగదును వేరు వేరుగా స్వామి వారి దేవస్థానానికి విరాళంగా అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో వెంకటేష్ తెలిపారు. రాజగోపుర నిర్మాణానికి తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు వాస్తవ్యులు కృష్ణమూర్తి దంపతులు కుటుంబ సభ్యులతో కలసి రూ.1,00,116లు అలాగే కర్నూలు జిల్లా కె.నాగలాపురం గ్రామానికి చెందినమూసాని మేఘనాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు రూ.50 వేల నగదును దేవాలయ కార్యాలయం నందు ఆలయ సూపరిటెండెంట్ మల్లికార్జునకు అందజేసినట్లు తెలిపారు.

సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం

గోనెగండ్ల, జూన్ 15: రాష్ట్ర మంత్రి వర్గంలో వంగలపూడి అనితకు హోంశాఖ మంత్రి పదవి ఇచ్చి మహిళను గౌరవించన సీఎం చంద్రబాబుకు ఎల్లప్పుడు రుణపడి ఉంటామని జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రసన్నకుమార్, అన్నారు. శనివారం గోనెగండ్లలో వారు మాట్లాడుతూ రాబోయే రోజులలో దళిత, గిరిజనులకు 27 సంక్షేమ పథకాలను అందించిన ఆదుకోవాలని కోరారు. ఎల్లవేళల దళితులు, గిరిజనులు మీ వెంటనే ఉంటారని వారన్నారు.

జగన్ పాస్ పుస్తకాల దహనం

గోనెగండ్ల, జూన్ 14: మాజీ సీఎం జగన్ బొమ్మతో ఉన్న పట్టదారు పాసుపుస్తకాలను గోనెగండ్లలో శనివారం టీడీపీ నాయకులు దహనం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు జిందాబాద్ అంటు నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టు కోవడంతో చంద్రబాబుకు ప్రజలు నిరుద్యోగులు జేజేలు పలుకుతున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, రమేష్‌నాయుడు, బేతాలబడేసా, మాజీ సర్పంచ్ రంగముని, నూరహ్మద్, రఫీ, ఫకృద్దీన్, భారతం రహంతుల్లా టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

ఆస్పరి, జూన్ 15: రాష్ట్రంలోని వెనకబడిన వర్గాల అభివృద్ధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఆస్పరి మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గంలో యాదవ కులానికి చెందిన శ్రీనివాస్ యాదవ్‌కు స్థానం కల్పించినందుకు శనివారం వారు హర్షం వ్యక్తం చేశారు. నూతన మంత్రి శ్రీనివాస్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయ, సోమలింగ, సుదర్శన్ యాదవ్, యాగంటి రాఘవేంద్ర, ఉచ్చీరప్ప, మహానంది, గోపాల్ పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్‌లో శిక్షణ

ఆదోని టౌన్, జూన్ 15: ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సత్యవతి ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి హేమలత మాట్లాడుతూ మహిళలు గర్భాశయంలో వ్యాప్తి చెందే క్యాన్సర్ గురించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు గీత, విజయశాంతి, సంధ్యారాణి, ఖలీల్, సోమశేఖర్ స్వామి పాల్గొన్నారు.

బీసీ కులాల జనాభా జాబితాను ప్రకటించాలి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 15: రాష్ట్రంలో చేసిన కులగణన సర్వే ప్రకారం బీసీ కులాల జనాభా జాబితాను ప్రకటించాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి అన్నారు. శనివారం బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ ఆయన మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో బీసీ కులాల హక్కులను సాధించుకునేందుకు 15 ఏళ్ల కిందట డివిజన్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ పట్టణ డివిజన్ కమిటీలను త్వరలోనే ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహించిందని, అందులో ప్రతి కులానికి సంబంధించిన జనాభా సంఖ్యను ప్రకటించలేదన్నారు. కొత్త ప్రభుత్వం ఆయా కులాల జనాభా జాబితాను ప్రకటించాలని కోరారు. సమావేశంలో నాయకులు దస్తగిరి నాయుడు, దేవేంద్రప్ప, ఫక్రుద్దీన్, దేవెట్టి ప్రకాష్, రాజేశ్వరరావు, వీరభద్ర, రామాంజనేయులు సోమశేఖర్, మల్లేశ్వరప్ప, మహదేవ, రాజశేఖర్ పాల్గొన్నారు.

మున్సిపల్ విద్యపై అవగాహనతో సీనియారిటీ జాబితాను రూపొందించాలి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 15: మునిసిపల్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను మున్సిల్ విద్యావ్యవస్థపై అవగాహనతో రూపొందించాలని ఎంటీఎఫ్ పట్టణ అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు అనిల్ కుమార్, బసవరాజు అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి విడుదల చేసిన సీనియారిటీ జాబితా మరోసారి మున్సిపల్ విద్యావ్యవస్థపై అవగాహన లేమి కనిపిస్తుందని ఆరోపించారు. మున్సిపల్ విద్యావ్యవస్థలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులను సీనియర్లుగా చూపించారన్నారు. వారి అపాయింట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ మున్సిపాలిటీగా ఇప్పటికే పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను జాబితాలో పొందుపరచడం, అపాయింట్మెంట్ తేదీలు ముందు వెనక తేడాలు ఉన్నాయన్నారు. జీవో 506, 507 ద్వారా బదిలీలు, ఇతర మునిసిపాలిటీలకు కార్పొరేషన్లకు బదిలీ అయిన వాటిపై, సర్వీస్ రూల్స్‌ను పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, సురేష్, మద్దయ్య, దస్తగిరి, బసవరాజు, కోటన్న, సాల్మన్ రాజు, ఈశ్వరమ్మ హర్ష శిల్ప పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 15: మంత్రి టీజీ భరత్‌ను ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం నగరంలోని న్యూ కౌన్సిల్ హాలులో నగర పాలక సంస్థ ఉన్నతాధికారులతో మంత్రి టీజీ భరత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మంత్రిని కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

ఎన్డీఏ కూటమి విజయం పట్ల హర్షం

ఆస్పరి, జూన్ 15: దేశ చరిత్రలో బీజేపీ అఖండ విజయం సాధించిందని బీజేపీ పక్షాన ఎన్డీఏ కూటమి మూడోసారి అధికారాన్ని చేపట్టడం హర్షనీయమని ఓబీసీ జిల్లా ప్రోగ్రాంకో-కన్వీనర్ గోవింద్ స్వామి అన్నారు. శనివారం ఆస్పరిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన పార్థసారథికి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు కర్ణ, నాగేష్, రాందాస్, నారాయణ, పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

దేవనకొండ, జూన్ 15 : కర్నూలు ఎంపీ బస్తీపాడు నాగరాజుని మండల కురువసంఘంనాయకులు కలిశారు. ఎన్నికలలో కురువలు నాగరాజు గెలుపు కోసం కృషి చేసిన్నట్లు కురువ సంఘం కార్పొరేషన్ మాజీ డైరక్టర్ దేవవకొండ మలయ్య అన్నారు. మల్లికార్జున ,నరసింహులు గోపాల్ ,విజయ్ కుమార్ ,రాజు ,తదితరులు ఉన్నారు.

కౌతాళం: రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను శనివారం మండల టీడీపీ నాయకులు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డితో కలిసి మంత్రిని కలిశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, రైతు విభాగం జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు మంత్రిని కలిసిన వారిలో టీడీపీ మండల నాయకుడు, ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం మాజీ ట్రస్ట్ బోర్డు మెంబరు కోట్రేష్ గౌడ్, దమ్ములదిన్నె రమేష్‌గౌడ్, కోసిగి నాయకులు భరద్వాజ్ శెట్టి, విజయరామిరెడ్డిలు ఉన్నారు.

అయోధ్య రామ మందిరం స్టాంపు విడుదల ఆనందదాయకం

పత్తికొండ టౌన్, జూన్ 15: అయోధ్య రామమందిరం ప్రతిమ ఉన్నటువంటి పోస్టల్ స్టాంపును కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం ఆనందదాయకమని బీజేపీ జిల్లా నాయకులు, పత్తికొండ మండలం కిసాన్‌మోర్చా అసెంబ్లీ ఇన్‌చార్జి సీసీ రంగన్న అన్నారు. శనివారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన అయోధ్య రామమందిరం ప్రతిమ స్టాంపును స్థానిక పోస్టుమాస్టర్ సబ్ రిజిస్ట్రార్ కృష్ణనాయక్ చేతుల మీదుగా స్థానిక బీజేపీ నాయకులకు స్టాంపును అందజేయడం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దండి మల్లికార్జున, శంకరయ్య, కరణం చంద్రన్న, గోవర్ధన్ నాయుడు, లక్ష్మణ స్వామి, రామ్మోహన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులను అరికట్టాలి

పత్తికొండ టౌన్, జూన్ 15: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ చిన్న చిన్న రేకుల షెడ్లలో విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని ఆరోపించారు. పత్తికొండ నియోజకవర్గంలో బీసీ బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా సీట్లు కేటాయించాలని, ప్రతి హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆల్తాఫ్, శివ, అహ్మద్, వినోద్, వలి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి సన్మానం

నందవరం, జూన్ 15: నందవరం టీడీపీ నాయకులు గురురాజరావును శనివారం టీడీపీ కార్యకర్తలు సన్మానం చేశారు. మండల కేంద్రమంలో మంచి మెజార్టీ రావడంతో పార్టీకి మరింత బలం చేకురిందని గురురాజారావు అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామన్నగౌడు, మైనార్టీ నాయకుడు, షాదిక్ పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది సేవలు మరువరానివి

నందవరం, జూన్ 15: సీనియర్ న్యాయవాది ఇబ్రహీపుం శేషిరెడ్డి ప్రజలకు చేసిన సేవలు మరవరానివని టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు దేశాయి మాదవరావు అన్నారు. శనివారం ఆయన మృతదేహన్ని సందర్శించి నివాళి అర్పించారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆదోని, జూన్ 15: ఆదోనిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి డీఎస్సీ అభ్యర్థులు శనివారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు స్వగృహంలో క్షీరాభిషేకం నిర్వహించారు. మెగా డీఎస్సీపై చంద్రబాబు నాయుడు మొదటి సంతకం చేసిన సందర్భంగా ఆదోనిలో నిరుద్యోగులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, పాడేగల్ అయ్యన్న, శేశిరెడ్డి, దిబ్బనకల్ లక్ష్మన్న, రంగన్న, బుద్ధారెడ్డి, తిమ్మప్ప, మరియు రైతులు, యువకుల పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు


చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నిరుద్యోగులు, మాజీ ఎమ్మెల్యే

పెన్షన్ రూ. 6వేలు పెంచుతూ సీఎం చంద్రబాబు సంతకం చేయటంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని శివన్న నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు సోమన్న, స్థానిక అధ్యక్షులు రామాంజనేయులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు శేషమ్మ, రఘువీరా, పెద్దయ్య, గుంటెప్ప, నాగరాజు, రంగన్న, సుంకన్న పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన అంగన్‌వాడీలు

ఆదోని, జూన్ 15: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడును వారి స్వగృహంలో శనివారం అంగన్వాడి కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ విజయ ఢంకా మోగించడంతో అంగన్వాడీలు మీనాక్షినాయుడుకు శాలువా కప్పి, పూలమాల వేసి స్వీట్లు తినిపించారు.

మా కూతురు జాడ తెలపండి

● మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు

గోనెగండ్ల, జూన్ 15: తమ కూతురు కనిపించకుండాపోయి 56 రోజులు అవుతున్నదని, ఎక్కడ ఉన్నదీ ఇప్పటి వరకు పోలీసులు కనిపెట్టలేకపోయారని బాలిక తల్లిదండ్రులు రుష్యేంద్రరెడ్డి, రామేశ్వరమ్మ ఆవేదన చెందుతున్నారు. ప్రతి రోజూ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని అన్నారు. వారు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులు మాట్లాడుతూ తన ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న తమ రెండో కూతురు ఏప్రిల్ నెల 21 తేదీ మధ్యాహ్నం నుంచి కనబడటం లేదని అన్నారు. అదే రోజు సాయంత్రం గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని అన్నారు. కాగా బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి మిస్సింగ్ కేసు నమోదు చేశామని సీఐ రామకృష్ణయ్య తెలిపారు.